
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 సెప్టెంబరు 2024





కొల్లూరు: వరద నీటిలో చిక్కుకుని దెబ్బతింటున్న మామిడి మొక్కలు

కృష్ణమ్మ కన్నెర్ర నుంచి ప్రజలు కోలుకుంటున్నారు. ముంపు నుంచి లంకలు, తీర ప్రాంత గ్రామాలు తేరుకుంటున్నాయి. వరదలతో ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందిన వారు ఇళ్లకు చేరుకుంటున్నారు. పేరుకుపోయిన బురద, కోల్పోయిన ఆస్తులను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. కృష్ణమ్మ బీభత్సంతో అపారనష్టం నెలకొంది. సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నష్టాల అంచనాలకు ప్రత్యేక బృందాలను ప్రభుత్వం రంగంలోకి దింపింది. పంటలు, ఆస్తుల పరిశీలనలో ఆయా బృందాలు నిమగ్నమయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేవలం వరి పంట ఒక్కటే 1,88,363 ఎకరాల్లో దెబ్బతిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అంచనాలకు అందని విధంగా లంక గ్రామాలు భారీ నష్టాన్ని చవిచూశాయి. కొన్ని లోతట్టు ప్రాంతాలు వరద ముంపులోనే ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలన్నీ చెత్తా చెదారాలతో నిండిపోగా పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

వీడిన వరద.. ఇళ్లకు జనం

- తేరుకుంటున్న లంక గ్రామాలు
- నష్టంపై అంచనాల్లో ప్రత్యేక బృందాలు
- రూ.వెయ్యి కోట్లకుపైగానే పంటలు కృష్ణార్పణం
- ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం
- వాణిజ్య పంటలు ఒక్క ఎకరా దక్కదని రైతన్న ఆవేదన
- సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం ఎదురుచూపు



రేపల్లె: వెల్లటూరు సమీపంలో వరద తాకిడికి కుళ్ళిపోయిన పసుపు దుంపలను చూపెడుతున్న రైతు

రేపల్లె/ తెనాలి, బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు బారిన పడిన గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. కృష్ణమ్మ కరుణించటంతో వరద తగ్గుముఖం పట్టింది. తీర ప్రాంత వాసులు కొంతమేర భయాన్ని వీడి ముప్పు నుంచి బయటపడ్డ గ్రామాల్లోకి పయనమవుతున్నారు. కృష్ణమ్మ మహోగ్రంతో అతలాకుతలమైన లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. కృష్ణమ్మ కన్నెర్రతో ఐదు రోజులుగా నీటిలో మునిగిపోయిన గృహాలను చూసుకునేందుకు ప్రజలు గురువారం తరలివచ్చారు. కరకట్టవెంబడి ఉన్న గ్రామాల్లోని ప్రజలు సామగ్రిని తీసుకుని గృహాలకు పయనమయ్యారు. గృహాలు కోల్పోవటంతో ఎక్కడ ఉండాలా అని ఆలోచనలో పడ్డారు. గురువారం ఉదయం బాపట్ల, కొల్లూరు, రేపల్లె మండలాల్లో కురిసిన వర్షం ఆయా గ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేసింది. అయితే కొద్దిసేపటికే ఐదు రోజులుగా మాయమైన ఎండ జాడ కానరావడంతో ఊపిరి పీల్చుకున్నారు. వరద వీడటంతో చోటుచేసుకున్న నష్టం వెలుగు చూస్తోంది. ప్రభుత్వ, ప్రజల ఆస్తులు భారీగా దెబ్బతిన్నాయి. లంక గ్రామాల్లో రహదారులు చాలా చోట్ల వరద ఉధృతికి కోతకు గురయ్యాయి. వరద పంటలతో పాటుగా గృహాల మీద నుంచి ప్రవహించడంతో కనివినీ ఎరుగని రీతిలో ప్రజలు నష్టపోయారు. నన్న చిన్నకారు కూలీ చేసుకునే కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలు నేల కొరగటంతో కన్నీటిపర్యంతమయ్యారు. వరద వల్ల కొట్టుకు వచ్చిన వ్యర్థాలన్నీ ఆయా గ్రామాలు, లంకల్లోని రోడ్లపైన దర్శనమిస్తున్నాయి. డ్రిప్‌పైపులతో పాటు తాడి చెట్లు, అరటి చెట్లు రహదారుల వెంట పొలాల్లో దర్శనమిస్తున్నాయి. వీటన్నింటిని తొలగించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశుధ్య సిబ్బంది సరిపోవడం లేదు. వాణిజ్య పంటలు ఉరకెత్తిపోయి రూపురేఖలు కోల్పోతున్నాయి. అరటి తమలపాకు, బొప్పాయి, పసుపు, కంద పంటలలో వరద నీరు ఇంకా బయటకు వెళ్లలేదు. ఆయా తోటల్లో నీరు బయటకు వెళ్లాలంటే రహదారులకు గండి కొట్టాల్సిందేనని రైతులు పేర్కొంటున్నారు. లంకల్లో ఉద్యాన పంటలు ఏమీ మిగలలేదు. చేతికందివచ్చే దశలో ఉన్న పంటలు కూడా నీటిపాలయ్యాయి. మొత్తం మీద రూ.వెయ్యికోట్లపైనే పంటల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నష్టం అంచనాలు తేలితే ఇది రెట్టింపు ఉంటుందనేది రైతుల వాదన. ప్రకాశం బ్యారేజి దిగువన కేవలం రెండు మండలాల్లో ఉద్యాన పంటల నష్టం అంచనా వేస్తేనే రూ.100 కోట్లపైన ఉందంటే, బ్యారేజి ఎగువన, దిగువనున్న మిగిలిన మండలాల్లో లెక్కకడితే దీనికి మూడురెట్లు పెరగొచ్చనేది అంచనా. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేవలం వరి ఒక్కటే 1,88,363 ఎకరాల్లో దెబ్బతిందని అంచనా వేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అరటి, కంద, పసుపు, తమలపాకు, జామ తోటలు మొత్తం 8,535 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా. వాణిజ్య పంటలు 90 శాతం వరకు పెట్టుబడులు పెట్టేసి, దిగుబడి కోసం ఎదురుచూస్తుంటే, వరికి కూడా సగంపైనే పెట్టుబడులు పెట్టేశారు. కరకట్ట వెంబడి ఉన్న పెనుమూడి, మైనేనివారిపాలెం, లంకేవానిదిబ్బ ఎస్టీ కాలనీ పూర్తిగా గృహాలు దెబ్బతిన్నాయి. మోర్తోటముక్తేశ్వరస్వామి దేవాలయం వరద తాకిడికి ముందుభాగమంతా కొట్టుకుపోయి ముఖమండపం దెబ్బతింది. రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి పల్లెపాలెం, రావిఅనంతవరం, వేణుగోపాలస్వామిగుడి, వెల్లటూరు లంకగ్రామాలు అరటితోటలు వరద ముంపు నుంచి బయటపడ్డాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..

లంక గ్రామాలతో పాటు వరద ముంపునకు గురైన ప్రాంతాలన్నీ దాదాపుగా తేరుకోవడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. వరద ప్రవాహం తగ్గిన ప్రాంతాల్లో ఇళ్లు,రోడ్లు శుభ్రం చేసేందుకు పెద్ద ఎత్తున సిబ్బంది రంగంలోకి దిగారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు తాగునీటి విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని కూడా గ్రామాల్లో మోహరించి ఇంటింటి ఆరోగ్య సర్వే కూడా చేపడుతున్నారు. పారిశుధ్య పనులపై ఫిర్యాదుల నేపథ్యంలో బాపట్ల కలెక్టర్ స్వయంగా కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు.

నష్టం అంచనాల్లో నిమగ్నం..

వరదలు తగ్గుముఖం పట్టి ముంపులో ఉన్న పొలాలు, ఊళ్లు బయటపడుతుండడంతో క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలకు సర్వే బృందాలను ప్రభుత్వం రంగంలోకి దించింది. ఆస్తులు, పంటలకు జరిగిన నష్టం అంచనాల గణనకు ప్రత్యేక బృందాలు శాఖల వారీగా రంగంలోకి దిగాయి. ఇళ్లలో జరిగిన నష్టానికి సంబంధించి రెవెన్యూ యంత్రాంగం ఇంటింటికి తిరిగి లెక్కలు వేస్తుండగా, పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖలు సేకరిస్తున్నాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా 151 గ్రామాలకు గాను 151 బృందాలు పంట నష్టం గణనకు పనిచేయనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముంపు బారి నుంచి వ్యవసాయ, ఉద్యాన పంటలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఉద్యాన పంటలు ఒక్క ఎకరం కూడా దక్కవని రైతులు చెబుతుంటే, పల్లపు ప్రాంతాల్లోని వరి పంట పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను తొలగించడానికి అదనపు ఖర్చవుతుంటే, రెండో పంట వేసుకోవడానికి మళ్ళీ పెట్టుబడి అవసరం ఉంటుంది. వేమూరు మండల పరిధిలో ఐదు రోజుల నుంచి పొలాల్లోనే నీరు ఉండటంతో వరి నాట్లు పూర్తిగా కుళ్ళిపోయాయి.



రేపల్లె : పెనుమూడి పల్లెపాలెంలో గృహం పూర్తిగా వరదలో కొట్టుకుపోవటంతో రోడ్డుపైనే జీవనం సాగిస్తున్న కుటుంబం



రేపల్లె మండలం రావిఅనంతవరం సమీపంలో వరద తాకిడికి మాడి పోయిన బొప్పాయితోట



భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో నీటి ప్రవాహానికి మాడిపోయిన కాకర, బీర, సొరపాదులు



రేపల్లె: వరద పోటు కారణంగా చిద్రమైన మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



కొల్లూరు: వరద ఉధృతికి విత్తనంతో సహా బయటపడ్డ పసుపు పైరు



కొల్లూరు: పసుపు పైరును వీడని వరద ముంపు



రేపల్లె: రావిఅనంతవరంలో వరద సమయంలో నాడు నీటమునిగిన వేణుగోపాలస్వామిగుడి



నేడు వరద తగ్గటంతో బయటపడ్డ వేణుగోపాలస్వామి గుడి

బాబు భరోసా కోసం..

- లంక గ్రామాల్లో పర్యటించనున్న సీఎం

నిండా మునిగి.. సర్వం కోల్పోయి.. సాయం కోసం కృష్ణమ్మ వరద బాధితులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రెక్కల కష్టం, ఏళ్లుగా కూడబెట్టుకున్న ఆస్తులతో పాటు తిండి గింజలు, నిత్యావసరాలను కృష్ణమ్మ మింగేయగా కట్టుబట్టలతో నిరాశ్రయులైనవారు ఎందరో. ఇలాంటి వారందరూ మళ్లీ బతికి బట్టకట్టాలంటే ప్రభుత్వ సాయం తప్పనిసరి. కృష్ణా తీరంలో వరదలకు పంటలు, ఊళ్లకు ఊళ్ళు మునిగిపోయిన నేపథ్యంలో బాధితులకు భరోసా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు లంక గ్రామాల పర్యటనకు రానున్నారు. పర్యటన సందర్భంగా సాయం ప్రకటించే అవకాశం ఉంది. అయితే నిండా మునిగిన తమకు ఉదారంగా సాయం చేయాలని చంద్రబాబును బాధితులు వేడుకుంటున్నారు. రెండో పంట వేయడానికి ప్రోత్సాహం అవసరమని, లేకుంటే మళ్లీ సాగు చేపట్టలేమని కన్నీటి పర్యంతమవుతున్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వారిని ఆదుకోవాలని కోరుతున్నారు. చేతికంది వచ్చిన పంటలతో పాటు ఇప్పటికే వేలల్లో పెట్టుబడితో వేసిన పంటలు దక్కలేదని, ఈ పరిస్థితుల్లో పెట్టుబడితో పాటు రాయితీ కావాలంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై ఇస్తే మళ్లీ పంట వేయగలుగుతామని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం

- రైతులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఊహించని భారీ విపత్తు.. భారీ నష్టం వాటిల్లింది. భారీ పెట్టుబడి పెట్టి, పంట చేతికందే దశలో నీటిపాలైంది.. అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం.. అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు హామీ ఇచ్చారు. గురువారం కొల్లిపర, మండలంలో ఆయన పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం గురించి తెలుసుకున్నారు. జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. పంట నష్టంతోపాటు, విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేందుకు కేంద్ర సాయాన్ని కోరతానన్నారు.



కొల్లిపర: వల్లభాపురంలో వరదకు పసుపు దెబ్బతిందని కేంద్ర మంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటికి తెలుపుతున్న రైతులు



సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ. కోటి విరాళం అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



యడ్లపాడు: కొండ వీడుకోట ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను డీఎఫ్‌వో రామచంద్రరావుతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నేడు వేమూరుకు చంద్రబాబు?

వేమూరు: కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం వేమూరు నియోజకవర్గానికి రానున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి గురువారం వస్తారని తొలుత భావించిన అధికారులు వేమూరు మార్కెట్ యార్డు సమీపంలో హెలీప్యాడ్‌పై దిగేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణం అనుకూలించని కారణంగా ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడింది. అయితే శుక్రవారం చంద్రబాబు వస్తారన్న ఉద్దేశంతో వేమూరులోని హెలీప్యాడ్ వద్ద మార్కింగ్ చేసి సమీపంలో అధికారులు జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో నీట మునిగిన పైర్లను పరిశీలించి, బాధిత కుటుంబాలను చంద్రబాబు పరామర్శించనున్నారు. అనంతరం రాత్రికి వేమూరులో బస చేసి శనివారం ఉదయం రేపల్లె పర్యటనకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



వేమూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్



వెల్లటూరు లంకగ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారి నాడు జలమయం



వరద తగ్గటంతో బయటపడిన వెల్లటూరు లంక గ్రామాలకు వెళ్ళే రహదారి



కొల్లూరు: వరద ఉధృతికి కోతకు గురైన రహదారి



కొల్లూరు: రావిఅనంతవరంలో నాడు వరదనీటిలో నానుతున్న అరటితోట



నేడు వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ అరటితోట

ఆర్టీసీకి నష్టం.. రూ.కోటి

- గ్యారేజ్‌ల మునకతో రూ.30 లక్షలపైనే
- మొరాయిస్తున్న సర్వీసులు.. కదల్లేని స్థితిలో 36 బస్సులు

గుంటూరు, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదలు ఆర్టీసీని కూడా నష్టపరిచాయి. జిల్లాలో ప్రయాణికుల నుంచి వచ్చే ఆదాయంలో రూ.కోటి వరకు నష్టం కలిగినట్లు అధికారులు అంచనా వేశారు. వర్షాలు, వరదలతో గతనెల 31 నుంచి వరుసగా నాలుగు రోజులు బస్సుల రాకపోకలను నిలిపివేశారు. దీంతో ఆదాయం కోల్పోయినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు. గుంటూరు - అమరావతి, పర్చూరు, బాపట్ల వంటి మార్గాలతో పాటు పలు గ్రామీణ సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోకి గతంలో ఎన్నడూ లేని విధంగా వరద నీరు చేరుకుంది. వరద కారణంగా గుంటూరు-1, 2 డిపోల్లోని 186 సర్వీసుల్లో సగానికి పైగా మొరాయిస్తున్నాయి. గురువారానికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొద్దామని అధికారులు ప్రయత్నించినా సాంకేతిక లోపంతో అనేక బస్సులు మొరాయించాయి. 36 సర్వీసులు కదల్లేనిస్థితిలో గ్యారేజ్‌లోనే ఉన్నాయి.



గుంటూరు బస్టాండ్ ఆవరణలో చేరిన నీరు (ఫైల్)

కండెక్టర్లు, డ్రైవర్లు ఆగ్రహం

వరదలతో బస్సులు మొరాయిస్తుండటంతో ఆ ప్రభావం ఉద్యోగులపై పడుతోంది. గుంటూరు-1, 2 డిపోల్లో అత్యధిక బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఈ క్రమంలో గుంటూరు-1 డిపోలో అధికారులు విధులకు హాజరైన డ్రైవర్, కండక్టర్లకు లీవ్‌లు వేశాం.. ఇళ్లకు వెళ్ళిపోండి.. అని చెప్పడంపై యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులు మొరాయిస్తే తామేం చేస్తామని, బలవంతంగా లీవ్‌లు రాయడం ఏమిటని మండిపడ్డారు.

ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు

- గురుపూజోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గనిర్దేశకులని జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో గురువారం గురుపూజోత్సవం జరిగింది. తొలుత ప్రజాప్రతినిధులు, అధికారులు సర్వేపల్లి రాధకృష్ణన్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సత్కరించారు. అనంతరం హెనీక్రిస్టీనా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేసి, వారిని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. తమ తల్లిదండ్రులు ఉపాధ్యాయులేనని వారి స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి చేరినట్లు చెప్పారు. విద్యార్థుల్ని స్ఫూర్తిప్రదాతలుగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రసంగిస్తూ ఏ రంగంలో నిపుణులైనా ఉపాధ్యాయుల శ్రమతోనే అత్యున్నత స్థాయికి చేరతారన్నారు. ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిలో 84 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వారేనని వారిని ప్రేమతో ఆదరిస్తూ సొంతబిడ్డల్లా భావించి తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ రామలింగేశ్వరరెడ్డి, డీఈవో శైలజ, ఎస్ఎస్ఏ ఏపీసీ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ సజీల తదితరుల పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి వేడుకను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి తదితరులు



కొల్లిపరలో పంటనష్టం వివరాలను అధికారులను అడిగితెలుసుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజా

దెబ్బతిన్న ప్రతి రైతును ప్రభుత్వాలు ఆదుకుంటాయి

కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కొల్లిపర, సెప్టెంబరు 5 : రైతుల కష్టాన్ని వెలకట్టలేమని, వరదలకు రైతులు నష్టపోవడం బాధాకరమని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలు అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం గ్రామాల్లో ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రకృతి విపత్తు వల్ల తలెత్తిన నష్టం తదితర అంశాలపై రైతులతో చర్చించారు. అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖలు వ్యవసాయ, డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో వరదకు, భారీ వర్షాలకు ఎంత నష్టం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ బుకింగ్, బీమా తదితర చర్యల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే కాంపోనెంట్, సబ్సిడీ, బీమా తదితర ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత వరద నష్టం సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సహాయ చర్యలు చేపడతామన్నారు. వరదకు దెబ్బతిన్న ప్రతి రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోనున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరద కారణంగా లంకగ్రామాల్లో పంట నష్టం తీవ్రంగా జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన లంక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటి రెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సహాయనిధికి రూ. 28,40,710 విరాళాలు



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ సభ్యులు

గుంటూరు, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద బాధితుల సహాయార్థం పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం అందిం చేందుకు ముందుకొచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని వారు కలిసి విరాళాలను అందజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ. లక్ష, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ రూ. 10 వేలు, బొమ్మిడాల శ్రీకృష్ణ మూర్తి ఫౌం డేషన్ రూ. 5 లక్షలు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ రూ.1,70,710, నరేడ్కో క్యాపిటల్ జోన్ ఆంధ్రప్రదేశ్ రూ.10 లక్షలు, చెలికాని సీతారామయ్య ఆర్గానిక్స్-గుంటూరు రూ. 10 వేలు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్-అమరావతిరూ. 5 లక్షలు, శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్ రూ. లక్ష, వివా ది స్కూల్-నంబూర్ రూ. లక్ష, నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ రూ.లక్ష, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ రూ.50 వేలు, టాప్ కిడ్స్ స్కూల్ రూ. లక్ష, స్టెమ్ స్కూల్ రూ. లక్ష కలిపి మొత్తం గురు వారం నాటికి రూ. 28,40,710 కలెక్టర్ సహాయనిధికి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను అభినందించారు.



కలెక్టర్‌కు విరాళాలు అందజేసిన పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

సింథటిక్ కంపెనీ రూ.10 లక్షలు అందజేత



బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళికి చెక్కు అందజేస్తున్న అబ్దుల్ సలాం

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : వరద బాధితులకు అత్యవసర సాయం కింద రూ.10 లక్షలు విరాళాన్ని అందించడం అభినందనీయమని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. గురువారం ప్రకాశం జిల్లా మేదరమెట్లకు చెందిన సింథటిక్ కంపెనీ యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించింది. సంస్థ సీనియర్ మేనేజర్ అబ్దుల్ సలాంతో ఆ చెక్కును కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి మరో రూ.90 లక్షలు ఇవ్వడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

మల్లెల రాజేష్ నాయుడు విరాళం రూ.10 లక్షలు



విరాళపు చెక్కును మంత్రి లోకేష్ కు అందచేస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన ఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, తెలుగుదేశం నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు గురువారం రు.10 లక్షల విరాళాన్ని ప్రక టించారు. ఆయన తన విరాళపు చెక్కును రాష్ట్ర మంత్రి లోకేష్ కు అందజేశారు. రాజేష్ నాయుడును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.

గుడిపూడి గ్రామస్తుల సాయం పదిలక్షలు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితుల కోసం మండ లంలోని గుడిపూడి గ్రామస్తులు తమ దాతృత్వాన్ని చాటు కున్నారు. సుమారు రూ 10 లక్షలను సేకరించి ఈ మొత్తం సహాయాన్ని చెక్కు రూపంలో గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయనకు అంద జేశారు. సహాయం అందించిన వారిలో గ్రామానికి చెందిన చిగురుపాటి సాంబశివరావు రూ5 లక్షలు, సంగం డెయిరీ పాల కేంద్రం ద్వారా రూ 50వేలు, గ్రామంలోని ఐదు డ్వాక్రా సంఘాల ద్వారా రూ 50వేలు, మిగిలిన మొత్తాన్ని గ్రామస్తుల ద్వారా సేకరించి మొత్తం రూ 10 లక్షలను సీఎం చంద్రబాబుకు అంద జేశారు. కార్యక్రమంలో జి.అప్పారావు, ఎల్. గజానన, కె.పుల్లారావు, జి.అచ్యుత రామయ్య, జి.తాతారావు, జి.ఆంజనేయులు, ఎస్. శ్రీనివాసరావు, చిగురుపాటి సాంబయ్య, అమరనేని సుధాకర్ ఉన్నారు. ఈ మొత్తం ఆర్థిక సాయాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు సేకరించి వరద బాధితుల సహా యార్థం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



రూ. 50 లక్షల చెక్కుని కలెక్టర్‌కు అందజేస్తున్న డ్వాక్రా గ్రూపుల మహిళలు, డీఆర్‌డీఏ, లీడ్‌బ్యాంకు అధికారులు

డ్వాక్రా గ్రూపుల మహిళల ఉదారత

- వరద బాధితులకు రూ. 50 లక్షల సాయం అందజేత
- మెప్మా ద్వారా మరో రూ. 30 లక్షలు

గుంటూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయనిధికి జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు తమ ఉదారతను చాటుకొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా, డ్వాక్వా గ్రూపుల మహిళలు భారీగా విరాళాలు సేకరించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ - వెలుగు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.50 లక్షలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - వెలుగు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ. 30 లక్షల చెక్కులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహర నాధ్, లీడ్ డిస్ట్రిక్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, స్వయంసహాయక సంఘాల సభ్యులు అందించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ హరిహరనాధ్ మాట్లాడుతూ జిల్లాలో డీఆర్‌డీఏ పరిధిలోని 20,632 స్వయం సహాయక సంఘాలు, మెప్మా పరిధిలోని 19,118 స్వయం సహాయక సంఘాలు వరదబాధితుల సహాయ నిధికి రూ. 1.25 కోట్లు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మిగతా ఆర్థిక సహాయం సోమవారం అంది స్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు ఎస్అశోక్, రాంబాబు, నారాయణ, ఉషా, కీర్తి పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

సంతకాల ఫోర్జరీపై ఫిర్యాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 5 : మునిసిపల్ కమిషనర్, సర్వేయర్ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్‌ను తయారుచేసిన సంఘటన పట్టణంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు.. సత్తెనపల్లికి చెందిన గొల్లపల్లి వెంకటరావుకు పట్టణంలోని 3,401 చదరపు గజాల ఖాళీ స్థలం పూర్వార్జితంగా సంక్రమించిందని.. దీనిని స్వాధీనం చేసుకొనేందుకు సర్టిఫికెట్ ఇప్పించాలని 2024 మార్చి 14న మునిసిపల్ కమిషనర్‌కు, సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఆ భూమి అతనిది కాదని తేలడంతో సర్వేయర్, కమిషనర్ అతనికి సర్టిఫికెట్ ఇవ్వలేదు. అయినప్పటికీ ఆ సర్వేయర్, కమిషనర్ ఆ స్థలం వెంకటరావుదేనని నిర్ధారించినట్టు దొంగ సర్టిఫికెట్‌ను మార్చి 24, 2024న పుట్టించాడు. ఈ సర్టిఫికెట్‌లో సర్వేయర్, కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఈ దొంగ సర్టిఫికెట్ విషయం బుధవారం మునిసిపల్ కమిషనర్, సర్వేయర్ దృష్టికి వెళ్ళింది. ఈ సర్టిఫికెట్ తామిచ్చింది కాదని గుర్తించారు. ఈ విషయమై మునిసిల్ సర్వేయర్ షఫీ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పట్టణ సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసిన వెంకటరావు పై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పొన్నూరులో వెండి దుకాణంలో భారీ చోరీ

- స్థానికుల అప్రమత్తతో దొరికిన దొంగలు
- రూ. 30 లక్షల చోరీ సొత్తు, వాహనం చంద్రగిరిలో స్వాధీనం
- తెనాలిలో మరో ఇద్దరు అదుపులోకి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు5: దొంగతనాలు చేయడంలో ఆరితేరిన ముఠా ఓ వెండి దుకాణంలో బుధవారం అర్ధరాత్రి భారీ చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడిన సంఘటన పొన్నూరులో జరిగింది. అర్బన్ పోలీసులు, స్థానికులు, బాధితుల కథనం ప్రకారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌కు సమీపంలో తోటలమ్మ గుడి పక్కనే వెండి, బంగారు ఆభరణాల విక్రయించే ధనలక్ష్మీ జ్యూవెలర్స్ ఉంది. బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ దుకాణంలో షట్టర్లు పగలగొట్టి దుండగులు దుకాణంలోకి ప్రవేశించారు. సుమారు రూ. 30 లక్షల విలువైన 38 కిలోల వెండి అభరణాల చోరీకి పాల్పడ్డారు. చోరీ దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి.



సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యాలు

స్థానిక యువకుల అప్రమత్తతతో దుండగుల పట్టివేత

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌కు సమీపంలోని షరాఫ్ బజార్‌లో కెజిఎన్ యూత్ పండుగలు నిర్వహిస్తూ వుంటుంది. మరో రెండు రోజులో వినాయకచవితి పండుగ నేపథ్యంలో కేజీఎన్ యూత్ సభ్యులు వినాయక మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీఎన్ సభ్యులు రాత్రి వేళ మండపం నిరిస్తుండంగా సమీపంలోకి ధనలక్ష్మీ జ్యూవెలర్స్ వద్ద అలికిడి కావడం, తెల్లటి ఫార్చ్యూనర్ వాహనం హడావుడిగా రావడం.. వాహనం లోపలికి లోడింగ్ చేస్తూ గుర్తుతెలియనివ్యక్తులు ఉండటంతో .. యూత్ సభ్యులకు అనుమానం వచ్చింది. వెంటనే ఆ యువకులు అక్కడికి వెళ్లడంతో అది గమనించిన దుండగులు వాహనంలో పారిపోయేందుకు యత్నించారు. ఇద్దరు యువకులు ధైర్యం చేసి దుండగుల వాహనాన్ని



పొన్నూరు పోలీసులకు ఆభరణాలు అప్పగిస్తున్న చంద్రగిరి పోలీసులు

వెంబడించారు. దుండగుల్లో ఓ యువకుడు రతన్ సింగ్‌ని గట్టిగా పట్టుకుని బంధించే క్రమంలో వాహనంలోని మరో ఇద్దరు అతన్ని తప్పించేందుకు..వాహనం దిగి స్థానిక యువకులపైకి దాడికి యత్నించారు. దీనిని స్థానిక యువకులు ప్రతిఘటించడంతో దుండగులు పరారయ్యారు. వాహనంలోని వ్యక్తులు ఇద్దరు దొంగలను వదిలి కారులో పారిపోయారు. చోరీ సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకుల అదుపులో ఉన్న రతన్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.ఈ



పొన్నూరులో స్థానిక యువకుల అదుపులో ఉన్న రతన్‌సింగ్, చంద్రగిరిలో పోలీసులు అదుపులోకి తీసుకున్న బీహార్ దొంగలు

సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు.. చోరీ జరిగిన గంటల వ్యవధిలోనే చోరీకి ఉపయోగించిన వాహనం, చోరీ జరిగిన సొత్తు, వాహన డ్రైవర్ ముకేష్ మలీని తిరుపతి సమీపంలోని చంద్రగిరిలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చోరీలో పాలుపంచుకుని స్థానిక యువకులపై దాడికి దిగిన మరో ఇద్దరు సుమన్ కామిత్, విక్రమ్ సింగ్, ఉత్తమ్ సింగ్‌లను కూడా పోలీసులు తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో నింది తులను ప్రశ్నిస్తునట్లు తెలుస్తోంది.

గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ ఇద్దరు నిందితులు

నిందితుల్లో ఇద్దరు చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డారు. పొన్నూరులో చోరీ ఘటనలో కారులో పరారైన నలుగురు నిందితులను బెంగళూరుకు వెళుతున్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు గురువారం ఉదయం 10.30 గంటల సమ యంలో రాగానే టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు.

ఇద్దరు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారును పరిశీలించగా, రూ.30 లక్షల విలువైన బంగారు, వెండి, రోల్డ్ గోల్డ్ ఆభరణాలు కనిపించాయి. కారుతో పాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను, కారు, ఆభరణాలను చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గురువారం రాత్రి 10 గంటల సమయానికి చంద్రగిరికి చేరుకున్నారు. వీరికి ఇద్దరు నిందితులు, ఆభరణాలు, కారును చంద్రగిరి పోలీసులు అప్పగించారు.

నేటి నుంచి కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమ్మె

- జీఎన్ఎం చేసిన వారికి పోస్టులు ఇవ్వడంపై ఆగ్రహం



గుంటూరు జీజీహెచ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 5 : రాష్ట్రంలో ని వివిధ ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు మెరుపు సమ్మె కు దిగనున్నారు. శుక్రవారం నుండి తాము విధులకు హాజరు కాబోమంటూ డీడీలు,ఆసుపత్రి సూప రింటెండెంట్‌లకు గురువారం నోటీసులు ఇచ్చారు. ఏఎన్ఎం లుగా పనిచేస్తున్న వారికి జగన్ ప్రభు త్వంలో జీఎన్ ఎం గా శిక్షణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ కోర్సు ను కుదించి శిక్షణ ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారికే రూ. ఐదువేలు అదనపు పారితోషకం గా చెల్లించి స్టాఫ్ నర్సు పోస్టు ల్లో నియ మించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తాజాగా జీఓ జారీ చేసింది. రెగ్యులర్ పోస్టు ల్లో స్టాఫ్ నర్సు పోస్టు ల్లో ఎన్ఎం శిక్షణ పొందిన వారిని నియమించడం వల్ల గత 15 ఏళ్ల గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని బాధి తులు చెబుతున్నారు. జీఓ రద్దు చేసే వరకు తాము సమ్మె చేస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో కూడా కాంట్రాక్టు స్టాఫ్ నర్సు లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


ఆహార సరఫరా వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

వరద బాధితులకు అండగా రావడం హర్షణీయం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం ఎంతో మంది చొరవగా ముందుకు రావడం హర్షణీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరులోని మౌర్య ఫంక్షన్ హాల్ వద్ద గుంటూరు హోటల్స్ అండ్ అలైడ్ ఇన్‌స్టిట్యూషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ బయలుదేరిన నిత్యావసర పంపిణీ వాహనాలను గురువారం ఆమె జెం డా ఊపి పంపారు. ఆమె మాట్లాడుతూ ఆపద సమయంలో వరద బాధితులను ఆదుకునేందుకు వివిధ రంగాల ప్రముఖు లు, ప్రజలు ముందుకు రావటం హర్షణీయమని, వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముత్తినేని రాజేశ్, మౌర్య సుబ్రహ్మణ్యం, యనమదల సాంబశివరావు, పొనకళ్ల సుబ్రహ్మణ్యం, సింగంశెట్టి వీరయ్య, నున్న రమేష్ పాల్గొన్నారు.

విరాళాల కోసం ప్రత్యేకంగా డెస్క్ ఏర్పాటు

విజయవాడలో సర్వసం కోల్పోయిన ప్రజలకు అండగా ప్రజల నుం చి వివిధ రూపాల్లో విరాళాలు కోరుతున్నట్లు ఎమ్మెల్యే మాధవి తెలిపా రు. ఈ విరాళాల కోసం గుంటూరు శ్రీనివాసరావుపేటలోని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఒక డెస్క్‌ను ఏర్పాటు చేశామని, 7వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే తెలియజేశారు.

● యువనేత నారా లోకేశ్ పిలుపు మేరకు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, శ్రీ భ్రమర ట్రస్టు చైర్మన్ గళ్లా రామచంద్రరావు భారీ సహాయక చర్యలు చేపట్టారు. గుంటూరు నుంచి ట్యాంకర్ల ద్వారా విజయవాడ ముంపు బాధితులకు తాగునీరు సరఫరా చేశారు. సింగ్‌నగర్‌లో రెండు వేల మందికి భవిష్యత్తులో కూడా వాడుకునే విధంగా మినరల్ వాటర్ క్యాన్లతో తాగునీరు అందజేశారు.

● గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు చంద్రబాబు ప్రభు త్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. వరద బాధితుల కోసం ప్రభుత్వం ప్రకటించిన సహాయాన్ని ఆమె గురువారం బాధిత కుటుంబాలకు అందజేసింది. ముత్యాలరెడ్డి నగర్, సుగాలి కాలనీ, గౌతమి నగర్, అంబేడ్కర్ నగర్లలో వరద ముపు బారిన పడ్డ 272 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్, కార్పొరేటర్ కొమ్మి నేని కోటేశ్వరరావు, వీరాంజనేయులు, పేరయ్య, సాయి పాల్గొన్నారు.

ఏరుకి, నదికి తేడా తెలియని పులివెందుల ఎమ్మెల్యే

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడ ముంపు ప్రాంతాల్లో పర్యటించిన జగన్మోహన్‌రెడ్డి మాట లు హాస్యాస్పదంగా ఉన్నాయని బుడమేరుకి, నదికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే నసీర్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే నసీర్ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్, గుంటూరు జిల్లా కిరాణా షాప్స్ అసోసియేషన్, పలు స్వచ్ఛంద సంస్థలు విజయ వాడ వరద బాధితులకు 7వేల బ్రెడ్ ప్యాకెట్లు, పదివేల వాటర్ బాటిళ్లు, 6 వేల మందికి భోజనం పంపించారు. ఆ వాహనాలను నసీర్ జెండా ఊపి పంపించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రకృతి విపత్తును మ్యాన్ మేడ్ అంటూ ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ సాంబశివరావు, సుబ్రహ్మణ్యం, రాజశేఖరరెడ్డి, నజీర్, ప్రతాప్ శ్రీకాంత్, బాబు, కిరాణా అసోసియేషన్ గణేష్, అరవ పల్లి శ్రీనివాసరావు, మామిడి సురేష్, నిరమానూరి సురేష్, కొనకళ్ల సత్యం పాల్గొన్నారు.

● ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఇళ్లలోకి వరద నీరు వచ్చి ఇబ్బం దిపడిన కుటుంబాలకు సత్వరమే అందించిన పెద్ద మనస్సు ముఖ్య మంత్రి చంద్రబాబుదని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలో ప్రగతి నగర్, గడ్డిపాడు, బసవ తారకనగర్, జున్ను సాహెద్ నగర్లలోని 1323 కుటుంబాలకు గురువారం ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి వర్షాల వల్ల ఇళ్లలోకి నీరు వచ్చి నిత్యావసర వస్తువులన్నీ పాడైపోయి, పనులకు వెళ్లలేని కుటుంబాలకు బియ్యం, నూనె, కందిపప్పు, పంచదార అందజేశారు.


నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

● గుంటూరు, సెప్టెంబరు 5: విజయవాడ సింగ్ నగర్లో చేపట్టిన సహా య కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. వరద బాధితుల సమస్యలు తెలుసుకుంటూ ఆయనే స్వయంగా వాటర్ బాటిల్స్, భోజనం పాకెట్స్‌ను వరద బాధితు లకు అందజేశారు. చంద్రబాబు ముందుచూపుతో ఎక్కువ శాతం ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగారని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

బాధితులకు గుంటూరు క్లబ్ యాజమాన్యం ఆర్థిక సాయం

● సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కు అందజేత


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న గుంటూ రు క్లబ్ కార్యదర్శి సాంబశివరావు, కిరణ్ చౌదరి, మాజీ మంత్రి ఆలపాటి, చుక్కపల్లి రమేష్


గుంటూరు, సెప్టెంబరు 5: విజయవాడలో వరద బాదితులను ఆదుకునేందుకు గుంటూరు క్లబ్ యాజమాన్యం ముందుకొచ్చింది. బాదితుల సహాయార్థం రూ.10 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు విజయవాడ లో గురువారం అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు క్లబ్ కార్యదర్శి నల్లమోతు సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పాతూరి కిరణ్ చౌదరి, పయనీర్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్; మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ఉన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం రూ.5 లక్షలు


కలెక్టర్ నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరక్టర్స్ చుక్కపల్లి రమేష్, రాకేష్, ప్రియాంక, ప్రిన్సిపల్ ఉషారాణి

వరద బాదితులను ఆదుకునేందుకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమా న్యం రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మికి రూ.5 లక్షల చెక్కును ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరక్టర్స్ చుక్కపల్లి రమేష్, చుక్కపల్లి రాకేష్, ప్రియాంక, ప్రిన్సి పాల్ డాక్టర్ ఎమ్ ఉషారాణి ఉన్నారు.

వరద బాధితులకు స్టెమ్ ఉపాధ్యాయుల చేయూత


కలెక్టర్ నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న స్టెమ్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్ ఉపాధ్యాయులు వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. ఉపాధ్యాయులు రూ.లక్ష చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ కోసం కలెక్టర్ నాగలక్ష్మి ద్వారా గురు వారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు స్టెమ్ విద్యార్థుల ఎంపిక

స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్ విద్యార్థులు షేక్ సనా, బి.అభి రామ్, సీహెచ్ బాజీ, డి.మానవ్ తదితరులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ భరత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజ నిర్మాణానికి మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అంజుమన్ ఇస్లామిక్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అజ్ఞాన చీకటిని తొలగించి, జ్ఞాన జ్యోతిని ప్రసాదిస్తూ విద్యార్థుల భవిష్యత్తును కాంక్షించి, నిరంతరం తపించే ఉపాధ్యాయులను గౌరవిం చుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో అంజుమన్ సభ్యులు షేక్ సైదా, జాహిద్, అన్వర్ హుస్సేన్, మౌలానా రెహమాన్, మహమ్మద్ షరీఫ్, మటన్ రఫీ, గోల్డ్ మహమ్మదా, షౌకత్, షాహినా పాల్గొన్నారు.

యూబీఐ ఆధ్వర్యంలో...


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యూబీఐ అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 5: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులను కలసుకొని అధికారులు సత్కరించారు. ప్రాంతీయ అధిపతి ఎస్ జవహర్, ఏపీ ఎస్‌హెచ్‌ఈ కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహ్మద్, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గంగాధరరావును వారి కార్యాలయాల్లో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శారదా హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, విజ్ఞానంద బాలకుటీర్, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సి పాల్స్ కూడా సత్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి పథకాలు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ శ్రీహరి శ్రీనివాసకుమార్, మేనేజర్ బొమ్మిన హారిక తదితరులున్నారు.

విద్యార్థులతో మమతానుబంధం ఉండాలి : డాక్టర్ రత్తయ్య


అధ్యాపకులతో డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: విద్యార్థులతో ఉపాధ్యాయులకు మమతాను బంధం ఉండాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, విజ్ఞాన్స్ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యా యులు కూడా వారి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. అందుకోసమే యూనివర్శిటీలోని అధ్యాపకులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం 6 నెలల పాటు ఇండస్ట్రీలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, ప్రిన్సిపాల్ జే.మోహనరావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, యూనివర్శిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్య వ్యక్తులు సాధించిన విజయాలు స్ఫూర్తిదాయకమే


ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న టీటీకే రెడ్డి, భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: మన చుట్టూ ఉన్న సామాన్య వ్యక్తులు, వారు సాధించిన విజయాలు స్ఫూర్తిదాయకమేనని గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, వైద్య విద్య అదనపు డైరెక్టర్ డాక్టర్ టీటీకే రెడ్డి అన్నారు. గురువారం గుంటూరు మెడికల్ కళాశాల జింఖానా ఆడిటోరియంలో భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తన జీవితంలో తల్లిదండ్రులే నిజమైన స్ఫూర్తి ప్రదాతలని వారి తర్వాత నా గురువులు ఇలా ఎంతో మంది నా విజయంలో పాలుపంచుకున్నారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నా రు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఏ సుధీర్‌బాబు, కార్డియాలజిస్ట్ డాక్టర్ హరిత, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు తదితరులు మాట్లాడారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అంజలి ఘటిం చారు.

కేఎల్‌పీ స్కూల్లో..


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ స్కూల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందించాలని సూచించారు.

గురువులను గౌరవించడం మన ధర్మం : పాటిబండ్ల

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 5: గురువులను గౌరవించడం మన ధర్మమని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో స్థానిక నవభారత్‌నగర్‌లో నాథ్ వెల్నెస్ వరల్డ్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కోచ్, అంతర్జాతీయ వెటర్నన్ క్రీడాకారుడు జీజే కిషోర్‌ను ఆయన ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాథ్ వెల్నెస్ వరల్డ్ అధినేత గోపినాథ్, క్రీడా అసోసియేషన్ సభ్యులు దాసరి శ్రీకాంత్, జీవీఎస్ ప్రసాద్, మన్సూర్ వలి, అథ్లెటిక్ కోచ్ భాష్యం కృష్ణారావు, కే అరుణ్‌కుమార్, మన్సూర్‌వలి పాల్గొన్నారు

ఎస్‌పీఎస్‌హెచ్‌ఎస్‌లో...

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. పాఠశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులను ఒక నిర్దిష్ట మార్గంలో తీర్చిదిద్దే వ్యక్తి ఉపాధ్యాయుడని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్స్ డీ.దుర్గాశ్యామ్, టీ.శ్రీదేవి విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌అండ్‌జేసీలో...


సీతారామయ్య హైస్కూల్లో ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఐఎస్‌టీ చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం అధ్యాపక, అధ్యాపకేతర బృందం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అన్నమనేని మోహనరావు, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాల అధ్యాపకులకు సత్కారం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: స్థానిక జేకేసీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గురువా రం అధ్యాపకుల్ని సత్కరించారు. జేకేసీ కళాశాల అధ్యాపకులు ఎస్ వెంకటేశ్వర్లు(కెమిస్ట్రీ), డాక్టర్ జీవీఆర్‌కే సాగర్(గణితం), కె.వీణ (కామర్స్) తదితరుల్ని సత్కరించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ పి.గోపిచంద్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రాజేష్ రోషన్, ఎన్ అఖిల్, కేబినెట్ కార్యదర్శి వి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల వరకు పది రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలపై పలుచోట్ల వరదనీరు నిలిచి ఉన్న కారణంగా ఈ నెల 7, 8వ తేదీల వరకు పది రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నెంబరు. 07783 విజయవాడ-గుంటూరు, 07779 గుంటూరు - మాచర్ల, 07580 మాచర్ల-నడికుడి, 07579 నడికుడి-మాచర్ల, 07780 మాచర్ల-గుంటూరు, 07788 గుంటూరు-విజయవాడ, 07276 కాచీగూడ - మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ-నడికుడి రైళ్లను రద్దు చేశామన్నారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు 07973 నడికుడి-మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ-కాచీగూడ, 07279 విజయవాడ-తెనాలి, 07575 తెనాలి-విజయవాడ, 07281 నరసపూర్-గుంటూరు, ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు 07784 గుంటూరు-రేపల్లె, 07785 రేపల్లె-గుంటూరు, 07976 గుంటూరు-విజయవాడ రైళ్లను రద్దు చేశామన్నారు.

నేడు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి సీ1 ఏసీ చైర్‌కార్ భోగీ తొలగింపు

అనివార్య కారణాల వల్ల నెంబరు. 12747 పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 6వ తేదీ శుక్రవారం సీ1-ఏసీ చైర్‌కార్ భోగీని తొలగిస్తున్నట్లు డీఆర్‌ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకులకు ప్రత్యామ్నాయంగా సెకండ్ సిట్టింగ్ డీఈ1 భోగీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు టిక్కెట్ చార్జీలో వ్యత్యాసాన్ని రీఫండ్ చేస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఒక రోజు వేతనం

● విరాళంగా ఇచ్చిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్

పెదకాకాని, సెప్టెంబరు 5 : ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని తమ ఒక్కరోజు వేతనాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా గురువారం వర్సిటీ వీసీ గంగాధర్‌రావుకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వరదల కారణంగా అనేక మంది ప్రజానీకం, రైతులు ఇబ్బంది పరిస్థితులను ఎదుర్కొంటున్నందున, వారికి భరోసానందిస్తూ, త్వరగా పరిస్థితులు చక్కబడాలని కోరుకుంటూ, ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించేందుకు సుమారు 100 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం లను కలిసి తమ విరాళానికి సంబంధించిన వినతిపత్రాన్ని అందించారు. వరద పీడిత ప్రజలకు అండగా నిలబడినందుకు వీసీ, రెక్టర్, రిజిస్ట్రార్‌లు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.శ్రీనివాసరావు బయో టెక్నాలజీ, డాక్టర్ బసవయ్య, డాక్టర్ శ్యాం సుందర్, డాక్టర్ సిహెచ్ రవికుమార్, డాక్టర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ హాస్టల్స్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

గుంటూరు, సెప్టెంబరు 5 : జిల్లాలో బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బీసీ దళిత బహుజన ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక స్టాల్ గరల్స్ హైస్కూల్లో బాలికలు ఇబ్బందులకు గురైన హాస్టల్‌ను ప్రజా సంఘాల నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ- బీసీ బాలికల హాస్టల్ లోని బాలికల పట్ల అవమానకరంగా, అసభ్యకరంగా వ్యవహరించిన కిరణ్, కార్తీక్‌లపైన, వారికి సహకరించిన వాచ్‌మెన్‌పైన నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. సంక్షేమ హాస్టళ్లను ప్రతి నెలలో ఒకమారు కలెక్టర్ పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు తాటికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు, పాగళ్ల ప్రకాష్, సాదు మాల్యాద్రి, సికా సురేష్, డెన్నిస్ రాయ్, పాటిబండ్ల కోటేశ్వరావు, రాజేంద్రప్రసాద్, వేంపాటి విజయలక్ష్మి, కే.జయసుధ, కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మరో ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 5 : జిల్లాలో మరో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు ఇలా ఉన్నాయి.. వీఆర్‌లో ఉన్న కే.శివప్రసాదరావును తుళ్లూరు స్టేషన్‌కు, ఈ.రమాదేవిని మహిళా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. తాడికొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న డీ.రవీంద్ర బాబును గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ ఎస్‌ఐగా నియమించారు. అదేవిధంగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్న సాంబశివరావు నాయక్‌ను వెస్ట్ ట్రాఫిక్ ఎస్‌ఐగా నియమించారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో-1 గా విధులు నిర్వహిస్తున్న పీ.కోటేశ్వరరావును ఎస్‌హెచ్‌వో-2గా నియమించారు.

నేడు పర్యావరణ హిత వినాయక విగ్రహాలు పంపిణీ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 5: స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహి ళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నేడు పర్యావరణ హిత వినాయక విగ్రహాలు తయారు చేసి పంపిణీ చేయనున్నట్లు డైరెక్టర్ రోహిణీదేవి వెల్లడించారు. మట్టి విగ్రహాల్లో ధనియాలు, మెంతులు, ఇతర ఆకుకూర విత్తనాలు వేసి తయారు చేయించినట్లు కళాశాల డైరెక్టర్ రోహిణిదేవి తెలిపారు. ఈ నెల 6వ తేదీన సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని రిలయన్స్ మార్ట్, గుజ్జనగుండ్ల డిమార్ట్ వద్ద మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మద్యం షాపుల్లోని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి

తెనాలి అర్బన్: ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేసే ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పినపాటి కొండలరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానంలో టెండరింగ్ ప్రాతిపదికన షాపులు నిర్వహించనుందని వస్తున్న వార్తలతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న తమ శ్రమను గుర్తించి ప్రభుత్వం ఇతర కార్యాలయాల్లో పనిచేసేలా ఆదేశాలిచ్చి ఉద్యోగ భద్రతలను కల్పించాలని కోరారు.


విజయవాడలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

విజయవాడలో ముమ్మరంగా సహాయక చర్యలు

● పర్యవేక్షించిన గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 5 : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం 62వ డివిజన్ పైపుల రోడ్డులో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాలను పూర్వ స్థితికి తెచ్చేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక పారిశుధ్య పనుల్లో 100 మంది కార్మికులు, నలుగురు కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్యదర్శులతో సమన్వయం చేసుకుం టున్నామని అన్నారు. అతి త్వరలో తమకు కేటాయించిన ప్రాంతాన్ని సాధారణ స్థితికి తీసుకు వస్తామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

వరద బాధితులకు యూటీఎఫ్ వితరణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5: భారీ వర్షాలకు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితుల సహాయార్థం యూటీఎఫ్ తరఫున రూ. 60వేల విరాళం అందజేశారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో చెక్కును పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవికి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదలక్ష్మి, ఎం కళాధర్, జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, ఎండీ దౌలా, సీహెచ్ ఆదినారాయ ణ, ఎం గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో టీఎన్‌ఎస్‌ఎఫ్ శ్రేణులు

గుంటూరు, సెప్టెంబరు 5 : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల్లో టీఎన్‌ఎస్‌ఎఫ్ శ్రేణులు పాల్గొన్నట్లు టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దుకూరి రాంబ్రహ్మం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం విజయవాడలో చంద్రబాబును కలసి టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతల సహాయక చర్యలను సీఎంకి వివరించారు. రామబ్రహ్మం మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు పడుతున్న కష్టం ప్రతి యువకుడికి ఆదర్శమన్నారు. ఆయన స్ఫూర్తితో బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ శ్రేణులను సీఎం చంద్రబాబు అభినందించారని రాంబ్రహ్మం తెలిపారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైతే కఠిన చర్యలు

● విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సూర్య శ్రావణకుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 5 : ప్రభుత్వం కేటాయించిన నిధులను దుర్వినియోగపరిచే వారిపై కఠిన చర్యలు ఉంటాయని గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.సూర్య శ్రావణ కుమార్ అన్నారు. గుంటూరులోని విజిలెన్స్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖలపై నిఘా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి రెవెన్యూకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని సూర్య శ్రావణకుమార్ వెల్లడించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రావణకుమార్ గతం లో విశాఖపట్నం ఏసీపీగా పనిచేశారు. అక్కడ గంజాయి సాగు, అమ్మ కందారులపై ఉక్కుపాదం మోపారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థు లను మత్తు పదార్థాల అలవాటు నుంచి బయటకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపట్టారు.

తైక్వాండో పోటీలకు లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు

గుంటూరు, సెప్టెంబర్ 5 : జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన కాశీనాథ్ మార్షల్ అకాడమీ లో శిక్షణ పొందిన నన్విత (6వ తరగతి), బెల్లంకొండ రేణుక చౌదరి (8వ తరగతి), ఎం గ్రేసీ జాయ్ (9వ తరగతి), వి విక్రమ్ (6వ తరగతి) గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 10 వరకు తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా పొల్లాచిలోని దిశా ఏ లైఫ్ స్కూల్ వేదికగా సీబీఎస్‌సీఈ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు అండర్-14,17,19 విభాగాల్లో జరగనున్నాయి. ఆ పోటీలలో పాల్గొనేందుకు వెళుతున్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులను గురువారం స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ శౌరి అభినందించారు. ఈ సందర్భంగా కోచ్, కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు కాశీనాథ్‌రెడ్డి, సాయి సుబ్రహ్మణ్యం, విజయ్‌లను ఆమె అభినందించారు.



పదిహేనేళ్ల ప్రయాణం

అక్కినేని నాగచైతన్య తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదిహేనేళ్లు అయింది. ఆయన నటించిన తొలి చిత్రం 'జోష్' 2009 సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ పదిహేనేళ్ల ప్రయాణంలో విలక్షణమైన పాత్రలు ఎన్నో పోషించి, మంచి నటుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ చిత్ర యూనిట్ ప్రత్యేకమైన పోస్టర్ విడుదల చేసింది. సముద్రం దగ్గర ఫిషింగ్ బోట్ మీద నిల్చుని చిరునవ్వు చిందిస్తున్న చైతు లుక్ ఆకట్టుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత.


ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం


డి.సురేశ్‌బాబు

తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరఫున రూ.25 లక్షలు.. నిర్మాతల తరఫున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరఫున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరఫున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరఫున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు

32వ సినిమా విడుదలకు ముహూర్తం



విభిన్న కథాంశాలు ఎన్నుకొని వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న నాని తన 32వ చిత్రం వివరాలు గురువారం ప్రకటించారు. 'హిట్ 3' చిత్రంలో తన లుక్‌ని, గ్లింప్స్‌ను విడుదల చేశారు. డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. సిగార్ తాగుతూ, కారు నడుపుతూ రక్తపు చేతులు, గొడ్డలితో ఫెరోషియస్‌గా కనిపించారు నాని. 'హిట్ 3'లో ఆయన అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 2025 వేసవి సందర్భంగా మే ఒకటిన సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. 'హిట్ 3' చిత్రానికి సాను జాన్ వర్గీస్ ఛాయాగ్రహణాన్ని, మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

వినోదాన్ని పంచే సినిమా



ఫరియా అబ్దుల్లా నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019 విడుదలై సూపర్ హిట్ అయిన 'మత్తు వదలరా' సినిమాకు సీక్వెల్. ఈ నెల 13న విడుదలవుతున్న సందర్భంగా ఫరియా మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా ఒక డిఫరెంట్ థ్రిల్లర్. ఎన్నో ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లతో కూడిన కథ ఇది. ఇందులో పాత్రధారుల కష్టాల నుంచే కామెడీ పుడుతుంది. ఈ సినిమాలో సన్నిధి అనే స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తాను. నాది యాక్షన్‌తో నిండిన పాత్ర. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. కాలభైరవ ఇచ్చిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ సినిమా మొదటి భాగం కంటే మరింత వినోదాన్ని పంచుతుంది. ప్రస్తుతం తిరువీర్‌తో ఓ ప్రేమకథలో నటిస్తున్నా. త్వరలోనే ఓ తమిళ చిత్రం కూడా మొదలవ్వబోతోంది" అని ఫరియా చెప్పారు.



మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి

మంచు విష్ణు


తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాఖ్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

సంస్కృత టీచర్స్‌కు అంకితం



రచయిత, దర్శకుడు జనార్ధన మహర్షి 'శ్లోక' పేరుతో ఓ సంస్కృత చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాగిణి ద్వివేది ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని జనార్ధన మహర్షి కుమార్తెలు శ్రావణి, శర్వాణి నిర్మాతలు. ఈ సినిమా గురించి జనార్ధన మహర్షి వివరిస్తూ 'సినిమాలోని కీలకమైన రుద్రభూమి సన్నివేశాలను బెంగళూరు, మైసూర్‌లో చిత్రీకరించాం. దేశంలోని పురాతనమైన అనేక శ్మశానాలలో షూటింగ్ చేశాం. సంస్కృతంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనేక భారతీయ భాషల్లోకి అనువదిస్తాం. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మా చిత్రాన్ని సంస్కృత టీచర్స్‌కు అంకితం ఇస్తున్నాం' అని చెప్పారు. ఈ సినిమాలో తనికెళ్ల భరణి కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



యువతరానికి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రోటీ కపడా రొమాన్స్' అక్టోబరు 4న విడుదల కానుంది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. సినిమాలో ప్రతి పాత్ర యూత్‌కు కనెక్ట్ అవుతుందనీ, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ప్రధాన బలాలు అని దర్శకుడు తెలిపారు. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనీ, అది ఈ రేంజ్ అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారనీ నిర్మాతలు చెప్పారు.


స్పీడ్‌గా..



గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవి నటించిన 'స్పీడ్ 220' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోలిద్దరూ పోటీ పడి నటించారనీ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా అలరించే విధంగా సినిమా ఉంటుందని దర్శకుడు హర్ష బేజాగం తెలిపారు. కె.ఫణి, ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు ఈ సినిమాను నిర్మించారు.











డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ, అధికారులు

గురువులు సూచించిన మార్గంలో నడవాలి

● వీసీ ఆర్ శారద జయలక్ష్మి

లాంఫాం(తాడికొండ), సెప్టెంబరు 5: గురువులు సూచించిన మార్గంలో విద్యార్థులు నడిచి జీవితంలో స్థిరపడాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీఆర్ శారద జయలక్ష్మీదేవి తెలిపారు. గురువారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత గురువులను పూజించాలన్నారు. క్రమశిక్షణ, ఉత్తమ విలువలు కలిగేలా విద్యార్థులను తీర్చిదిద్దేది గురువులే అని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జీ రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, డీన్ పీజీ స్టడీస్ ఏవీ రమణ, జీ కరుణాసాగర్, పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● ప్రశంసా పత్రంలో మంత్రి నారా లోకేశ్

● పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 5: పార్టీకి అండగా నిలిచారు.. వైసీపీ అరాచకాన్ని ఎండగట్టారు.. మన టీడీపీ యాప్ ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేసి కూటమి విజయానికి కారణమైన టీడీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఐటీడీపీ కార్యకర్తలకు పంపిన ప్రశంసాపత్రంలో మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయకుండా పార్టీకి పని చేశారన్నారు. మీ కృషిని ఇలాగే కొనసాగించాలని కోరారు. మన టీడీపీ యాప్ మరింతగా ప్రజలకు చేరువ చేయాలని పత్రంలో విన్నవించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చేతుల మీదగా పలువురు లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాలను గురువారం సాయంత్రం అందుకున్నారు. ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్(చందు), ఐ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తలతోటి సురేంద్ర, సభ్యుడు మల్లెల శ్రీరాములకు ఎమ్మెల్యే గుంటూరు కార్యాలయంలో అందజేశారు.

అధికారుల అలసత్వంతోనే పంటలు మునక

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పెదనందిపాడు, సెప్టెంబరు 5 : పంట కాలువల్లో పూడిక తీయకపోవడం వల్లనే పంటలు నీట మునిగాయని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లనే పంటలు నీటమునిగాయన్నారు. వ్యవసాయ అధికారులు పంటల నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. 2019లో నల్లమడ ఆధునీకరణకు అప్పటి టీడీపీ ప్రభుత్వం 290 కోట్లు నిధులు మంజూరు చేసిందని, వైసీపీ ప్రభుత్వం వాటిని సద్వినియోగించకుండా ఆ నిధులను నిలిపివేసిందన్నారు. నల్లమడ ఆధునికీకరణకు నిధులు కేటాయించి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొప్పలపూడి రమేష్, కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన తెలుగురైతు నేతలు

మంగళగిరి, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజ గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను తెలుగు రైతు నేతలు గురువారం పరిశీలించారు. గుంటూరు చానల్‌కు గండి పడి సుమారు 150 ఎకరాల్లో మాగాణి పొలాలు గత నాలుగైదు రోజులుగా నీటిలో నానుతున్నాయి. ఈ విషయాన్ని తెలుగు రైతు నేతలు మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో నీటి పారుదల శాఖ అధికారులు పొక్లెయిన్ సాయంతో గండి పూడుస్తున్నారు.

తూము పూడికతీతకు అధికారుల అనుమతి

మంగళగిరి, సెప్టెంబరు 5: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని కొత్తపాలెం హైలెవల్ చానల్ కాల్వకట్ట వద్ద తూము పూడిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు పంట పొలాలను ముంచెత్తి దాదాపు మూడు అడుగుల మేర పంటలు నీట మునిగాయి. సుమారు 200 ఎకరాల్లో వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని స్థానిక రైతులు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ శాఖ ఈఈ మల్లికార్జునరావు గురువారం కాలువ కట్టను పరిశీలించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతుల అభ్యర్థన మేరకు కాల్వ కట్టకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తూము పూడిక తీయించేందుకు అనుమతి ఇచ్చారు.

రైతులకు అండగా ప్రభుత్వం : జనసేన నేత గాదె

కాకుమాను, సెప్టెంబరు 5: రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పకుండా ఆదుకుంటుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని కొల్లిమర్ల గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిస్థితిని పార్టీ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం పని చేసే విధంగా కృషి చేస్తానన్నారు. డ్రెయిన్ల సమస్యల పరిష్కారం చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చట్టాల త్రినాథ్, గడ్డం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

దుగ్గిరాల, సెప్టెంబరు 5: వరదలతో అతలాకుతలమైన పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లో పశువులకు దాణా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశుపోషకులకు పశువుల దాణాను అందించారు. పెదకొండూరులో 950 మందికి, గొడవర్రులో 500 మందికి దాణాను అందించారు. టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, కేసంనేని శ్రీఅనిత, ఎంపీటీసీ విశ్వనాధపల్లి శివకుమార్, మొలబంటి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్ల బాటిళ్ల పంపిణీ

మంగళగిరి, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం డీబీఎస్ గ్రూపు సంస్థల చైర్మన్ దేవతి భగన్నారాయణ ఆధ్వర్యంలో ఆరు వేల మినరల్ వాటర్ బాటిళ్లను గురువారం పంపించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న ఆలీనగర్ ముస్లింలు

దుగ్గిరాల, సెప్టెంబరు 5: దుగ్గిరాలలోని ఆలీనగర్ ముస్లింలు వరద బాధితులకు సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. విజయవాడలోని సింగ్‌నగర్, తాడేపల్లిలోని మహానాడు ప్రాంతంలోనూ వరదలతో ఇళ్లు ముంపునకు గురైన 1000 బాధిత కుటుంబాలకు పాలు, పెరుగు ప్యాకెట్లు, బ్రెడ్, బిస్కట్లు అందించారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



ఉద్దండ్రాయునిపాలెంలో లంక వరద బాధితులకు దుస్తులు అందజేస్తున్న రాజధాని మహిళా జేఏసీ

తుళ్లూరు, సెప్టెంబరు 5: మండలపరిధిలోని ఉద్దండ్రాయునిపాలెం లంక గ్రామానికి చెందిన వారికి అమరావతి మహిళా జేఏసీ నేత రాయపూడి శైలజా గురువారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలో ఓ చర్చిలో పునరావాసం కల్పించిన వారిని శైలజ, దళిత జేఏసీ నేత చిన్నా పరామర్శించారు. వారికి దుస్తులను అందజేశారు.

వరద బాధితులకు అండగా రాజధాని మహిళలు



సింగ్‌నగర్ పంపటానికి దొండపాడులో ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్న మహిళలు

తుళ్లూరు, సెప్టెంబరు 5: విజయవాడలోని వరద బాధితులకు రాజధాని మహిళలు అండగా నిలిచారు. రాజధాని గ్రామం దొండపాడు మహిళలు ఆహార పదార్థాలను బాధితులకు స్వయంగా తయారు చేసి పంపిణీ చేశారు. పులిహోర, పెరుగున్నం ప్యాకెట్లలో నింపారు. వాటర్ బాటిల్స్ అందజేశారు. విజయవాడ సింగ్‌నగర్ వరద బాధితులకు అందజేశారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

● కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



మత్స్యకారుల కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తుళ్లూరు, సెప్టెంబరు 5: రాయపూడి మత్స్యకారుల కాలనీవాసులకు నిత్యావసర సరుకులను గురువారం కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అందజేశారు. 50కిలోలు బియ్యం, పంచదార, కందిపప్పు, వంట నూనె, కూరగాయలు అందజేశారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్లు నిర్మాణం చేస్తామని వారికి ఎమ్మెల్యే హామీనిచ్చారు. ప్రభుత్వం వరద బాదితులకు అండగా ఉంటుందన్నారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టిందన్నారు. వరద కారణంగా వలలు పోయాయని జీవనోపాధి వాటి మీదేనని కలెక్టర్, ఎమ్మెల్యే వద్ద మత్స్యకారులు వాపోయారు. వాటిని ప్రభుత్వం సమకూర్చే విధంగా చూస్తామని కలెక్టర్ భరోసానిచ్చారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ వరద ప్రభావానికి గురైన పనులు యుద్ధప్రాతిపదికన చేస్తామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో వరద ప్రభావిత పాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు. వరదల్లో చిక్కుకున్న గ్రామస్థులను రక్షిత ప్రాంతాలకు తరలించిన అర్థాని బ్రహ్మయ్య, బెమ్మడి సత్తిబాబు, ధర్మాడి ఏసుబాబులను ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించి పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో కలెక్ట ర్ మాట్లాడుతూ ఆగస్టు 30, 31 తేదీల్లో భారీ వర్షాలు కారణంగా వరదలకు గురైన పట్టణాలు, మండలాల్లో ప్రభుత్వం ప్రకటించిన రిలీఫ్ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. వరదకు లంక గ్రామాలు, తాడేపల్లి మండలంలోని మహానాడులోని మూడు వేల ఇళ్లల్లోకి వరద నీరు వచ్చిందన్నారు. ఇలా వరదకు గురైన ప్రాంతాల నుంచి 9వేల కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించేందుకు ఎన్యుమరేట్ చేసిందన్నారు. జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఇంకా కొనసాగిస్తామని కలెక్టర్ చెప్పారు. నియోజకవర్గంలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం లాంచీలో రాయపూడి, పెదలంకకు ఎమ్మెల్యే, కలెక్టర్ వెళ్లారు. ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం వచ్చేలా చూస్తామని గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శివన్నారాయణ, ఆర్ఐ భవానీ ప్రసాద్, వీఆర్వోలు, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు సాహెబ్ జాన్, టీడీపీ నాయకుల, రైతు నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తాం

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 5: తాడేపల్లి పరిధి ప్రకాశం బ్యారేజీ దిగువన ముంపుకు గురైన మహానాడు ప్రాంతంలో కలెక్టర్ నాగలక్ష్మి, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలిసి గురువారం పర్యటించారు. ముంపుతో దెబ్బతిన్న ఇళ్లను కలెక్టర్ పరిశీలించి బాధితులతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సాయం అందిస్తుందని, వారు పూర్తిగా సాధారణ జీవితంలోకి వచ్చే వరకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను అధికారులు ఎన్యుమరేషన్ చేసి పరిహారం అందిస్తామన్నారు. వరద నీటిలో దెబ్బతిన్న ఇళ్లలో మరమ్మతులు చేసే వరకు నివసించడం సురక్షితం కాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నదికి ఆనుకుని ఉన్న ఇళ్లలో నష్టం జరిగిన వాటి పూర్తి వివరాలు సిబ్బంది ఎన్యుమరేషన్ చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వ్యర్థాలు లేకుండా పక్కాగా శుభ్రం చేయాలని మునిసిపల్, రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా, ఇన్‌చార్జి తహసీల్దారు సతీష్, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లి మహానాడులో వరద బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న కాట్రగడ్డ మధు

తాడేపల్లి, సెప్టెంబరు 5: మండలంలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన 37 వెనుకబడిన కులాలకు చెందిన పేదలకు మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో సీనియర్ నేత కాట్రగడ్డ మధు సూదనరావు నిత్యావసర సరుకులను సొంత ఖర్చులతో గురువారం పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసు అధికారి రాధిక, స్థానిక నేతలతో కలిసి వర్షాలకు ఇబ్బందిపడిన పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మూడు రోజులుగా మధు తన సొంత ఖర్చులతో మహానాడులో పేదలకు భోజనం, పులిహోర పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, కాట్రగడ్డ మధుసూదనరావు, మద్దినేని సుబ్రహ్మణ్యం, వడ్డేశ్వరం రాజారావు, సురేష్, అబ్రహం, దాసు, విక్టర్, ఏలియా, గోరా బాలజీ తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి మండలం గుండిమెడలో మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు వరద ముంపు బాధితులకు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, గుండిమెడ రమేష్‌బాబు, రఘుబాబు, రాంబాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళశాసనాలతో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్), వికాస తరంగిణి) మహానాడు, విజయవాడ ప్రాంతాల్లో సంయుక్తంగా నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. కాగా విజయవాడ కండ్రికలో టీడీపీ గుంటూరు పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, లింగంశెట్టి కృష్ణ కిషోర్, లీలా కృష్ణ ఆధ్వర్యంలో బాధితులకు 500 వాటర్ బస్తాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు

పెదనందిపాడు, సెప్టెంబరు 5 : మండలపరిధిలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక అశోకా పాఠశాలలో రోటరీ క్లబ్ సభ్యులు ఎంఈవో ముద్దన శ్రీనివాసరావుకు, పీఏఎస్ కళాశాలలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ కిషోర్‌కు, లయన్స్ మాంటిస్సోరీ సీబీఎస్ పాఠశాలలో పలవురు ఉపాధ్యాయులను ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, రోటరీ క్లబ్ సభ్యులు నల్లపునేని శివప్రసాద్, ఎన్‌వీఎస్ నాగేశ్వరరావు, పోపూరి లక్ష్మీనారాయణ, కూరాకుల శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది : ఎంఈవో కెన్నడీ

కాకుమాను, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ వృత్తి విలువైనది, ఉన్నతమైనదని ఎంఈవో కేవీఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంఈవో కెన్నడీ, ఎంఈవో-2 విజయ్‌భాస్కర్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారని అటువంటి ఉపాధ్యాయులు నిజమైన సంఘసేవకులు అని అన్నారు.



సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఎలక్ట్రికల్ షాపులో దొంగతనం

● రూ.7.50 లక్షల విలువైన వస్తువులు, రూ.1.08 లక్షల నగదు చోరీ

తాడికొండ, సెప్టెంబరు 5: స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లోని ఎలక్ట్రికల్ షాపులో రూ.7.50లక్షల విలువైన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సామగ్రితో పాటు, రూ.1.08 లక్షల నగదును చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ అడ్డరోడ్డులో తుమ్మల గోపిరెడ్డి విజయగణపతి ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తున్నాడు. షాపులో మేనేజర్‌గా ధనేకుల గౌతమ్ చౌదరి పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం షాపు తీయగా షాపులో వస్తువులు, ఫైల్స్ పేపర్లు చిందరవందరగా పడి ఉన్నాయి. కౌంటర్ టేబుల్‌లో తలుపులు పగలగొట్టి ఉండటంతో పాటు, బీరు తలుపులు తీసి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారని నిర్ధారించుకొని తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు వెంటనే క్లూస్ టీమ్‌ను సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ. కే వాసు తెలిపారు.

విక్రయ హక్కుల వేలంలో నృసింహాలయానికి పెరిగిన ఆదాయం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 5: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానంలో పూజా సామగ్రి, పలు విక్రయ హక్కులకు గురువారం నిర్వహించిన బహిరంగ వేలం, సీల్డ్ టెండరు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. ఎగువ సన్నిధిలో శీతల పానియాలు, సోడాలు, ఐస్‌క్రీం హక్కులకు గతంలో రూ.2,69,999 రాగా ఈ మారు రూ.3,51,999 (రూ.82,020 అదనం), ఎగువ, దిగువ సన్నిదులతోపాటు ఉపాలయమైన ఘాట్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పచ్చి కొబ్బరి చిప్పలు, గుమ్మడికాయలు పోగు చేసుకునే హక్కులకు గతంలో రూ.4,00,999 రాగా, ఈ మారు రూ.5,58,999 (రూ.1,58,000 అదనం), దిగువ సన్నిధిలో కొబ్బరికాయలు, తులసి మాల, దీపారాధన వత్తులు విక్రయ హక్కులకు గతంలో రూ.7,51,116 రాగా, ఈ మారు రూ.10,53,111 (రూ.3,01,995 అదనం), ఎగువ సన్నిధిలో టీ స్టాల్ నిర్వహించుకునే హక్కులకు గతంలో రూ.1,32,500 రాగా, ఈ మారు రూ.2,00,009 (రూ.67,509 అదనం) వచ్చినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనరు, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు. మొత్తంగా ఆయా హక్కులకు సంబంధించి గతంలో కంటే ప్రస్తుతం రూ.6,09,524లు అదనంగా వచ్చాయని, ఈ హక్కులు ఈ నెల 14 నుంచి సరిగ్గా ఏడాది కాలంపాటు చెల్లుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

కళాశాల అభివృద్ధికి చేయూత



దాతలు జగదీశ్, మాణిక్

పెదనందిపాడు, సెప్టెంబరు 5: కళాశాల అభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని పీఏఎస్ కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ(విశ్రాంత ఏఏస్పీ) అన్నారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల వసతి కల్పనకు దాతలు బయోఫర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రంగిశెట్టి జగదీశ్, డాక్టర్ పుల్లగూర మాణిక్‌రెడ్డిలు రూ. లక్ష విరాళాన్ని కళాశాల బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశారు. దాతలను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

రంగిశెట్టి ఫౌండేషన్ సహకారంతో ఆహార పొట్లాల పంపిణీ



బయోఫర్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సహకారంతో పంపిన ఆహార పొట్లాల పంపిణీ

దుగ్గిరాల, సెప్టెంబరు 5: మండలపరిధి చిలువూరు వాస్తవ్యులు, ప్రముఖ ఫార్మాసంస్థ బయోఫర్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్ బాబు వరదబాధితుల కోసం రెండు వేల మందికి ఆహారాన్ని సిద్ధం చేసి పంపారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తోటకూర సీతారామయ్య, సాదిక్, శేషగిరి, పలువురు తెలుగు యువత, జనసేన యువత విజయవాడలోని బాధితుల వద్దకు చేర్పించారు. తాడేపల్లి మహానాడు, విజయవాడలోని బాధితులకు రంగిశెట్టి రమేష్‌బాబు, జనసేన నాయకులు, వీరమహిళలు టాటా వాహనంలో ఇంటింటికీ తిరుగుతూ ఆహార పొట్లాలను అందించారు. చిలువూరు దయ్యాల పేటలో బాధిత 50 కుటుంబాలకు స్థానిక టీడీపీ నాయకులు ఆహారాన్ని అందజేశారు. వర్షాలకు ఇళ్లు మునిగి నిరాశ్రయులై, స్థానిక చెన్నకేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న 28 బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను అందించారు. స్థానిక టీడీపీ నాయకులు వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు, నక్కా చిరంజీవి, పర్వతనేని హర్షవర్ధన్, శంకర్‌నాయక్, సాయి, ఎద్దు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లాలి

సైకాలజిస్ట్ సుధీర్‌చంద్ర



మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న వైపీ ఆంజనేయులు

తాడేపల్లి, సెప్టెంబరు 5: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందు కెళితే కచ్చితంగా విజయం సొంత మవుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ చంద్ర అన్నారు. గురువారం కేఎల్‌యూ ప్రాంగణంలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ కే రూత్‌రమ్య, వీసీ సారధి వర్మ, ప్రోవీసీ ప్రసాద్, రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

చలపతి విద్యాసంస్థల్లో

తాడికొండ, సెప్టెంబరు 5: లాం, మోతడకలోని చలపతి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మోతడక, లాం చలపతి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ వైపీ ఆంజనేయులు పాల్గొని అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ అధ్యాపకులను ఘనంగా సన్మానించి అవార్డులను బహూకరించారు. కార్య క్రమాల్లో ప్రిన్సిపాల్స్ కొల్లి నాగ శ్రీనివాసరావు, ఎం చంద్ర శేఖర్‌రావు, కళాశాల కోశాధికారి యలమంచిలి అనంత కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామా రావు, ఫణికుమార్, వీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పెన్నుల బహూకరణ

తాడేపల్లి, సెప్టెంబరు 5: కుంచనపల్లిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు పెన్నులను బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో కుంచన పల్లి టీడీపీ గ్రామ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన అధ్యక్షుడు మేకల రాజా, శేషంశెట్టి శ్రీనివాసరావు, గడ్డం మురళీకృష్ణ, తోటకూర ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. కాగా తొలుత ఉదయం మెల్లెంపూడి గ్రామంలో ముంపునకు గురైన పంట పొలాలను టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, షేక్ నాగుల్, పఠాన్ ఖాసింఖాన్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, స్థానిక రైతులు పరిశీలించారు.



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 5: పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన నిత్యావసరాలను గురువారం రత్నాల చెరువులో పంపిణీ చేశారు. మగ్గాల గుంతల్లోకి నీళ్లు చేరి ఉపాధి కోల్పోయిన 1455 చేనేత కుటుంబాలకు మంత్రి నారా లోకేశ్ చొరవతో సహకారం అందిస్తున్నారు. ప్రతి కుటుంబానికి 50కిలోల బియ్యం, కిలో కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, పంచదార, బంగాళదుంపలు అందజేశారు. మంగళగిరి 24వ వార్డులో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ 79 చేనేత కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం వరద ముంపునకు గురైన చేనేత మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడల్లా చేనేత కార్మికులు జీవనోపాధి కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇది గమనించిన మంత్రి నారా లోకేశ్ వారికి నిత్యావసరాలు అందించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏనాడూ నియోజకవర్గ సమస్యలను పట్టించుకోలేదని, ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరించి రాజకీయాలు చేశారని విమర్శించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నేతలు వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, కాండ్రు శ్రీనివాసరావు, కారంపూడి అంకమ్మరావు, పడవల మహేష్, వంగర రమేశ్, కాశిన కొండలరావు, దైదా యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● సముద్రంలోకి లక్షా 34వేల 930 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 202 క్యూసెక్కులు



బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 5: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రధాన వాగుల నుంచి బుధవారం లక్ష 35వేల 132 క్యూసెక్కుల వరద నీరు గురువారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటి పారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.5 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 55 గేట్లను 3 అడుగుల మేర, 10 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు లక్ష 34 వేల 930 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 202 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్యకు నగదు అందజేస్తున్న ఏబీ పాలెం గ్రామస్థులు

పెదనందిపాడు, సెప్టెంబరు 5: విజయవాడ వరద ముంపు బాధితులకు ఏబీపాలెం గ్రామస్థులు బాసటగా నిలిచారు. గ్రామంలో కొంత మంది నాయకులు గ్రామంలో తిరిగి వరద బాధితులకు సాయం అందించాలని విరాళాలు సేకరించారు. గ్రామంలో వసూలు చేయగా వచ్చిన నగదు రూ.1,76,000ను మాజీ మంత్రి మాకినేని పెద్ద రత్తయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

పెదనందిపాడు, సెప్టెంబరు 5 : విజయవాడలో భారీ వర్షాలకు నిరాశ్రయులైన వరద బాధితులకు చేయూతనందించేందుకు గురువారం స్థానిక పీఏఎస్ కళాశాల విద్యార్థులు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఎన్‌సీసీ, విద్యార్థులు ర్యాలీగా తిరుగుతూ దుకాణాల వద్ద విరాళాలు సేకరించారు. సేకరించిన నగదును బాధితులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



జేసీబీతో చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు తొలగింపు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 5: పట్టణంలోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. గురువారం పట్టణం లోని 40వ వార్డులోని ఖాళీ స్థలాలలోని చెట్లను తొలగించి వర్షపు నీటిని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆదేశాలతో పట్టణం లోని ఖాళీ స్థలాలలోని చెట్లను తొలగించి వర్షపు నీటిని తొలగిస్తున్నామని తెలి పారు. వ్యర్థాలను ఖాళీ స్థలాలలో వేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మురళి, నాగభూషణం తదితరులు

పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అండగా ఉంటాం

● ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న గ్రామస్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం చెప్పారు. గ్రామంలోని డ్రెయిన్ పొంగి పరిసర ప్రాంత కాలనీల్లోకి నీరు చేరడంతో ఆ ప్రాంత ప్రజలను ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, సచివా లయ ఉద్యోగులు కలిసి ట్రాక్టర్ సాయంతో గ్రామంలోని పునరావాస కేంద్రానికి సురక్షితంగా తరలించారు. ఈ సందర్భంగా వారికి ఆహారం, ఇతర నిత్యావసరా లను గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంల సహకారంతో అందించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని డ్రెయిన్ పొంగి ఆ నీరు పరిసర కాలనీల్లో చేరాయన్నారు. దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని స్వయంగా వెళ్లి వారికి నచ్చజెప్పి గ్రామంలోకి తీసుకురావడం జరిగింద న్నారు. భోజనం, తాగునీరు, ఇతర సౌకర్యాలతో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వీరితోపాటు పారిశుధ్య కార్మికుల ఇళ్లుసైతం నీటిలో ఉండ టంతో వారిని కూడా ఇక్కడే ఆశ్రయం కల్పించి వారికి అవసరమైన నిత్యావసరా లను సమకూర్చామన్నారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గిన అనంతరం కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టి సురక్షితంగా తిరిగి వారి ఇళ్లకు పంపడం జరుగుతుం దని నాగభూషణం వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యో గులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరు కాకతీయ యూత్ ఆధ్వర్యంలో...

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని కొలకలూరు కాకతీ యయూత్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో గ్రామస్థులకు ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. గురువారం గ్రామం నుంచి యూత్ సభ్యులు ట్రాక్టర్లలో ఆహారపు ప్యాకెట్లను తీసుకువెళ్లి గ్రామస్థులకు అందిం చారు. వరద బాధితులకు తమ వంతు సాయం అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టి నట్లు యూత్ సభ్యులు తెలి పారు.



కొల్లిపర మండలంలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కొలకలూరు కాకతీయ యూత్ సభ్యులు



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శారద

పునరావాసకేంద్రంలో దుస్తులు, సబ్బులు పంపిణీ

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని బుర్రిపాలెం జడ్పీహెచ్‌ఎస్‌స్కూ ల్‌లో పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఎస్టీ కాలనీ వాసులకు డీ3 శారదా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు, సబ్బులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ శారద గురువారం పునరావస కేంద్రానికి వెళ్లి ఆమె చేతుల మీదుగా ఆశ్రయం పొందుతున్న వారికి అందజేశారు. గ్రామ సర్పంచ్ విజ యలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో వైద్యశిబిరం

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని కొలకలూరులో గ్రామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు కాలనీలోని అనారోగ్య సమస్యలతో ఉన్న పలువురు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మద్యం షాపుల్లోని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి

తెనాలి రూరల్, తెనాలి అర్బన్, సెప్టెంబరు 5: ప్రభుత్వ మద్యంషాపుల్లో పని చేసే ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ ఫేర్ అసోసియేషన్ నాయకులు పినపాటి కొండలరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానంలో టెండరింగ్ ప్రాతిపది కన షాపులు నిర్వహించనుందని వస్తున్న వార్తలతో ఉద్యోగులు ఆందోళన చెందు తున్నారన్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేస్తున్న తమ శ్రమను గుర్తించి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు సచివాలయ ఇతర కార్యాలయాల్లో పనిచేసేలా ఆదేశాలిచ్చి ఉద్యోగ భద్రతలను కల్పించాలని కోరారు. తెనాలిలో ప్రదర్శన చేసి యూనియన్ నాయకులు రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి శాంతియుతంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ధనరాజుపల్లి సురేష్, పినపాటి వంశీకృష్ణ, కొల్లూరు భాస్కర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



వీఎస్ఆర్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా పనిచేసి రాష్ట్రపతి పదవికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఎస్ ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికిరణ్, విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ పావులూరి శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, అధ్యాపకులు కళ్యాణ్‌కుమార్, సుగుణ, లక్ష్మీనారాయణ ప్రసంగించారు. జేఎంజే కళాశా లలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. రాధాకృష్ణన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించి ఆదర్శంగా ఉండా లని కోరారు. కొల్లేటి సతీష్, శారద, అమూల్‌మేరి, హేమలత, నిర్మల, అరు ణసుజాత పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సాలిపేట పాఠశాలలో ఉపాధ్యాయులు స్వర్ణలత, సుజాతలను సన్మానించారు. కాకరపర్తి సుబ్రహ్మణ్యం, కృష్ణమోహనరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పెదకాకాని: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించు కొని సిబార్ దంత వైద్య కళాశాల లో స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉపా ధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తూ భవిష్యత్ తరాలను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మోహన్ ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు బోధనతో పాటు విద్యా ర్థుల అభివృద్ధికి పాటుపడాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. తదనం తరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్.ఆర్.ఐ. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్ ప్రసంగిస్తూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ రమణారెడ్డి, వైస్ డీన్స్ డాక్టర్ ఎమ్.ప్రకాష్, డాక్టర్ బి.నగేష్, క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.సమత, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు చెప్పారు. బొల్లిముంత శివరామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పది మంది ఉత్తమ ఉపాధ్యాయు లను ఘనంగా సన్మానించారు. వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీని వాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, తరగతి గదుల్లో బోధన చేసి మంచి విద్యార్థులను సమాజానికి అందిస్తున్నారని చెప్పారు. మైత్రి హాస్పటల్ ఎండీ ఆలపాటి కృష్ణసందీప్, చింతల శ్రీనివాస రావు, మొవ్వా సత్యనారాయణ, కనపర్తి బెన్‌హర్‌లు ప్రసంగించారు. నల్లూరి వెంకటేశ్వరరావు, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, శారదాదేవి, కుర్రా శ్రీని వాసరావు, రాజ్యలక్ష్మి, డీవీ సుబ్బారావు, బెల్లంకొండ వెంకట్, నాగమణి, రోజ్‌మేరీలను సన్మానించారు. కార్యక్రమాన్ని బొల్లిముంత కృష్ణ, చందు సుబ్బారావు, రంగిశెట్టి రమేష్ పర్యవేక్షించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిబార్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్

శలపాడులో అంతిమయాత్రకు వరద కష్టాలు



వరద నీటిలో శ్మశాన వాటికకు వెళుతున్న శలపాడు వాసులు

చేబ్రోలు, సెప్టెంబరు 5: చేబ్రోలు మండలం శలపాడు వాసులను వరద కష్టం వీడటం లేదు. శలపాడు గ్రామ సమీపంలో గుంటూరు నల్లమడ డ్రెయిన్ ప్రవహిస్తూ ఉంటోంది. భారీ వర్షాలకు గుంటూరు నల్లమడ డ్రెయిన్ ఉప్పొంగి శెలపాడు, సుద్దపల్లి, వేజండ్ల గ్రామాలకు వరద వచ్చింది. గత ఐదు రోజులుగా వరద ముంపు వీడలేదు. ఇప్పటికే వేలాది ఎకరాలో వరి పంట నీటి పాలైంది. శలపాడు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు మృతి చెందగా ఆమె అంతిమయాత్ర చేయటానికి వరద కష్టాలు గ్రామస్థులకు ఎదురైయ్యారు. గ్రామం నుంచి సుమారు అర కిలో మీటర్ దూరంలో శ్మశాన వాటిక ఉంది. ఈ శ్మశాన వాటికకు వెళ్లాలంటే అంటే వరద ప్రవాహాన్ని దాటుకుని వెళాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మృతురాలి బంధుమిత్రులు మోకాలిలోతు వరద నీటిలోనే అంతిమ యాత్ర చేసుకుంటూ శ్మశాన వాటికకు వెళాల్సిన దుస్థితి ఏర్పడింది.

7, 8 తేదీల వరకు పది రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై పలుచోట్ల వరదనీరు నిలిచి ఉన్న కారణంగా ఈ నెల 7, 8వ తేదీల వరకు పది రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నెంబరు. 07783 విజయవాడ - గుంటూరు, 07779 గుంటూరు - మాచర్ల, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07788 గుంటూరు - విజయవాడ, 07276 కాచిగూడ - మిర్యా లగూడ, 07277 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను రద్దు చేశామన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ - కాచీగూడ, 07279 విజయవాడ - తెనాలి, 07575 తెనాలి - విజయవాడ, 07281 నరసపూర్ - గుంటూరు, ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు 07784 గుంటూరు - రేపల్లె, 07785 రేపల్లె - గుంటూరు, 07976 గుంటూరు - విజయవాడ రైళ్లను రద్దు చేశామన్నారు.

నేడు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ చైర్‌కార్ బోగీ తొలగింపు

అనివార్య కారణాల వలన నెంబరు. 12747 గుంటూరు - వికారాబాద్ పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 6వ తేదీ శుక్రవారం సీ1-ఏసీ చైర్‌కార్ బోగీని తొలగిస్తున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయంగా సెకండ్ సిట్టింగ్ డీఈ1 బోగీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు టిక్కెట్ ఛార్జీలో వ్యత్యాసాన్ని రీఫండ్ చేస్తామన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

కొల్లిపర, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయార్థం మండల పరిధి లోని అత్తోటకు చెందిన టీడీపీ నాయకులు కొరారు అంజనేయులు, దాసరి నరసయ్య రూ.20వేలను గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేం ద్రప్రసాద్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముంగర బుల్లికోటయ్య, వరకూటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో రక్తహీనతను అధిగమించవచ్చు

● డాక్టర్ షేక్ బీబీజాన్

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: తాజా ఆకుకూరలను ప్రతిరోజు ఆహా రంలో చేర్చుకుంటే రక్తహీనతను అధిగమించవచ్చని డాక్టర్ షేక్ బీబీజాన్ చెప్పారు. గురువారం పట్టణంలోని 9వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భి ణులకు, బాలింతలకు పోషన్ మా కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం, రక్త హీనత నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ బీబీజాన్ మాట్లాడుతూ గర్భిణులలో ఎక్కువశాతం రక్తహీన తతో బాధపడుతున్నారని చెప్పారు. అందుకు ప్రధాన కారణం పౌష్టికా హారం తీసుకోకపోవడమేనన్నారు. ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లలో ఐరన్ శాతం అధికంగా ఉంటాయని వీటిని ప్రతిరోజు తీసుకో వడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడటంతోపాటు ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికా హారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో సునీత తెలిపారు. 7నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతాన్ని తప్పనిసరిగా అందించాలని సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ తెలిపారు. దీనిద్వారా పిల్లల్లో ఎదు గుదల, పోషణశక్తి మెరుగుపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు దేవరపల్లి మృతి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5: మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దేవరపల్లి వసంతరావు గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ వసంతరావు టీడీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. వసంతరావు కుటుంబ సభ్యులను పరా మర్శించారు. వసంతరావుకు నివాళి అర్పించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబు రావు, యల్లవర్తి శేషు, మల్లంపాటి శ్రీనివాస్, ఆరెమండ విజయ్ కుమార్, చిలకా రవి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మంది వరద బాధితులకు పండ్ల పంపిణీ

చేబ్రోలు, సెప్టెంబరు 5: చేబ్రోలు జీఎస్ఎం ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యి మంది విజయవాడ వరద బాధితులకు గురువారం పండ్లు, బ్రెడ్లు, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5: వరద సాయంగా 400 గ్రామ పంచా యితీలకు రూ.6 కోట్లు విరాళం ప్రకటించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్‌కు పొన్నూరులో గురువారం పాలాభిషేకం నిర్వ హించారు. ఐలాండ్ సెంటర్‌లో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యన్నం నాయుడు, ఫిరోజ్, యలవర్తి వెంకటేశ్వరరావు, కె.రామారావు, వై.ఫణి, మాదాసు అప్పా రావు, సాయన సుధాకర్, కె.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు ఆహారం పంపిస్తున్న పట్టణ టీడీపీ నాయకులు

వరద బాధితులకు 1500 భోజనం ప్యాకెట్ల పంపిణీ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు పొన్నూరు పట్టణంలోని 19వ వార్డు టీడీపీ నాయకులు అండగా నిలిచారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అభిమానులు 1500భోజన ప్యాకెట్లు, మంచి నీరు గురువారం సిద్ధం చేసి విజయవాడ తీసుకు వెళ్లి బాధితులకు స్వయంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నడికట్ల నారాయణ రావు బాల కృష్ణ రెడ్డి, కాగిత హరీష్ అబ్రహం మాధవరావు, శౌరయ్య. నాగరాజు, జానీ, రఘు, బిట్ర రాజేష్, పసుపులేని చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న కూటమి నేతలు, అధికారులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5: పట్టణంలోని డీవీసీ కాలనీలో వరద ముంపుకు గురైన కుటుం బాలకు గురువారం నిత్యవసరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. డీవీసీ కాలనీలో భారీ వర్షాలకు 60 గృహాలు జలమయం కాగా ఆ కుటుంబాలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు అధికారులు 25కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో కూటమి పార్టీల నాయకులు మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీఐటీయూ విరాళాల సేకరణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5: సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం గురువారం విరాళాలు సేకరించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి టౌన్ చర్చి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్, అశోక్, జోనేష్, హుస్సేన్‌వలి, వెంకటసు బ్బయ్య, పద్మావతి, సునీత పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొల్లిపర, సెప్టెంబరు 5 : మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదే శాల మేరకు మండల పరిధిలోని అన్నవరంలంకలో 350మంది వరద బాధిత కుటుంబాలకు గురువారం టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు నిత్యవసరాలను, నీటిని అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు, పాస్టర్ రవీంద్ర, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండమూడి బోసుబాబు, మాస్ రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్ మాదిగ, లింగాల రమేష్, కొక్కిలిగడ్డ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



పసుపు దెబ్బతిందని మాజీ మంత్రి మేరుగ నాగార్జునకు, మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌కు తెలుపుతున్న రైతులు

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలి

● మాజీ మంత్రి మేరుగ నాగార్జున

కొల్లిపర, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదలు వల్ల రైతులకు అపా రమైన నష్టం జరిగిందని, నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవా లని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం మండలం లోని వరద ప్రభావిత ప్రాంతాలైన అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం గ్రామాల్లో ఆయన వైసీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మాజీ ఎమ్మెల్యే అన్నాబ త్తుని శివకుమార్, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ పంటనష్టాన్ని త్వరగా అంచనా వేసి రైతులను, కౌలురైతు లను ఆదుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వర దల వల్ల రైతులు భారీగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, నాయకులు నెర్ల కుటుంబరెడ్డి, ఆరిగ చంద్రా రెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న డాక్టర్ మన్నెహరీష్, డాక్టర్ వీఎస్ఆర్ భూపాల్ తదితరులు

సీఎం సహాయనిధికి క్యాపిటల్స్ హాస్పటల్స్ విరాళం

● యాజమాన్యానికి చంద్రబాబు అభినందన

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: క్యాపిటల్స్ హాస్పటల్స్ యాజమాన్యాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. గురువారం చంద్రబాబునాయ డుని కలిసిన క్యాపిటల్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నె హరీష్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వీఎస్ఆర్ భూపాల్‌లు సీఎం సహాయనిధికి రూ.25లక్షలు విరాళం చెక్కును అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో విరాళం అందించేందుకు ముందుకు వచ్చిన యాజమాన్యాన్ని చంద్రబాబు ప్రశంసించారు. ఐఎంఏ విజయ వాడతో అనుగుణంగా క్యాపిటల్ హాస్పటల్స్ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చంద్రబాబుకు తెలిపారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.



వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావుకు చెక్కు అందజేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఒక రోజు వేతనం

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల వితరణ

పెదకాకాని, సెప్టెంబరు 5: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని తమ ఒక్కరోజు వేతనాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ కు విరాళంగా గురువారం వర్సిటీ వీసీ గంగాధర్ రావుకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వరదల కారణంగా అనేకమంది ప్రజానీకం, రైతులు ఇబ్బంది పరిస్థితులను ఎదుర్కొంటున్నందున, వారికి భరోసాగా ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించేందుకు సుమారు 100 మంది కాంట్రాక్ట్ అసి స్టెంట్ ప్రొఫెసర్లు అంగీకరించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలను కలిసి తమ విరాళానికి సంబంధించిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గత 20 సంవత్సరాలుగా యూనివర్సిటీ అభివృద్ధికి, జాతీయ అంతర్జాతీయ ర్యాంకుల సాధనకు, న్యాక్‌గ్రేడ్ సాంధించడానికి తోడ్పాటు అందించామన్నారు. అలాగే వరద పీడిత ప్రజలకు అండగా నిలబడినందుకు వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్‌లు అభినందించారు. 77సంవత్సరాల వయసులో కూడా 24 గంటలు వరద తాకిడికి గురియైన ప్రదేశాలలో తిరుగుతూ, ప్రజాసేవ దృక్ప థంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, మంత్రివర్గ సహ చరులకు, అధికార యంత్రాంగానికి తోడ్పాటునందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్ర మంలో డాక్టర్ డి.శ్రీనివాసరావు బయో టెక్నాలజీ, డాక్టర్ బసవయ్య, డాక్టర్ శ్యాంసుందర్,డా. సిహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మన్నవలో నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

రైతుల కష్టం తీర్చలేనిది: టీడీపీ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతుల కష్టం తీర్చలేనిదని గుంటూరు పార్లమెంట్ టీడీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని దొప్పలపూడి, మన్నవ, జూపూడి గ్రామాలలో టీడీపీ నాయకులు పర్యటించి నీట మునిగిన వరి పైరును పరిశీలించారు. స్థానిక రైతులను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పైనుంచి వచ్చిన వరద తమ పంట పొలాలను ముంచివేసిందన్నారు. నేటికి వరద నీరు తగ్గలేద న్నారు. పంట పొలాలన్నీ జలసంద్రంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి నీటిలో నానిన పైరు దెబ్బతిని పంట నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ

తెనాలి రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని నందివెలుగు వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు, గ్రామంలోని విద్యార్థులకు శ్రీసాయి సేవాస మితి అధ్యక్షుడు లక్కరాజు సాయి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహిం చారు. వంశీకృష్ణ, సాయిసౌమ్యల జన్మదినం సందర్భంగా వారి తల్లిదండ్రుల సౌజ న్యంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణి, సమితి సభ్యులు మల్లేశ్వరరావు, పలువురు సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 5: స్థానిక నాజరుపేటలోని మహాలక్ష్మమ్మ (చెట్టు) గుడి వద్ద గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీమహాల క్ష్మమ్మ భక్త బృందం కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు నక్కా సాయినాథ్ మాట్లా డుతూ ప్రతి సంవ త్సరం శ్రావణ శుక్ర వారం చివరి శుక్ర వారం పేదలకు అన్నదాన కార్యక్ర మాన్ని దాతల సహ కారంతో నిర్వహిస్తా మని, ఈ సంవత్సరం వర్షాల కారణంగా గురువారం నిర్వహిం చామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నక్కా శంకర్, వెలక్కాయల హర్ష, యడ్లపల్లి పవన్, తిరుమలశెట్టి గోపి, భక్తులు పాల్గొ న్నారు.